
మండే ఎండలకు విరుగుడు వేసవి నేస్తాలు

- తరిగిపోతున్న వృక్ష సంపద, చెరువులు
- కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించాలి
- సంరక్షణ బాధ్యతగా భవిష్యత్ తరాలకు నేర్పాలి

కపిలేశ్వరపురం: మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరుగుతాయని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. మారిన ఆధునిక జీవన విధానంలో బయటకు వెళ్లలేని పరిస్థితులు ఎలాగూ ఉన్నాయి. దానికి తోడు పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. వానలు కురిసే వరకూ ఎండ వేడిని భరించక తప్పని పరిస్థితి. సహజ సిద్ధమైన ప్రకృతి నేస్తాలను పరిరక్షించుకోవడం ద్వారా విపత్కర పరిస్థితుల నుంచి రక్షించుకునే వీలు ఉంటుంది. గ్రామంలో చెట్టు, చెరువు, మట్టి, బావి ఇలా అనేక సహజ వనరులు మానవ నివాస ప్రాంతాలను చల్లగా ఉంచడంలో దోహదపడతాయి. అవగాహనతో మెలగడం ద్వారా వేసవిలో చల్లదనాన్ని ఆస్వాదించొచ్చు..

రెండు నియోజకవర్గాల్లో వేసవి నేస్తాలిలా..

రెండు నియోజకవర్గాల్లో విశాలమైన గ్రామీణ భూభాగం, గోదావరి తీర ప్రాంతం ఉంది. కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని గోదావరి తీర ప్రాంతం వెంబడి భారీ వృక్షాలున్నాయి. వాటితో పాటు మండపేట, రామచంద్రపురం రూరల్ గ్రామాల్లో రచ్చబండలుగా భారీ వృక్షాలు, చెరువులు, పచ్చటి పొలాలు ఉన్నాయి.



తాతపూడిలో రావి చెట్టు (ఫైల్)

ఇవన్నీ వేసవి తాపం నుంచి ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. వ్యవసాయ క్షేత్రాలు వెంబడి నీటిపారుదల శాఖ కాలువలున్నాయి.

నేలమట్టమవుతున్న వృక్ష సంపద

గత కాలంలో పూర్వీకులు నాటిన మొక్కలు వట వృక్షాలై తరతరాలుగా నీడనిస్తూ వచ్చాయి. రాను రాను అవి కాస్తా నేలమట్టమవుతున్నాయి. వాటి స్థానంలో కొత్తగా మొక్కలను పెంచే కార్యాచరణ అంతంత మాత్రంగా ఉంది. రెండు నియోజకవర్గాల్లో చెప్పుకోదగిన భారీ వృక్షాలు అనేకం ఉండేవి. తాతపూడి కాలిబాట వంతెన వద్ద సుమారు రెండు వందల సంవత్సరాలు నీడనిచ్చిన రావి చెట్టు కొన్నేళ్ల క్రితం సహజసిద్ధంగా నేలకూలింది. అంగర-కపిలేశ్వరపురం, రామచంద్రపురం-కోటిపల్లి ఇలా అనేక రహదారుల వెంబడి భారీ వృక్షాలు కాలం చెల్లడంతో నేలమట్టమవుతున్నాయి. ఇల్లు, రహదారి నిర్మాణాలకు అడ్డు వచ్చాయనో... వాస్తుకు విరుద్ధంగా ఉందనో.. రాలుతున్న ఆకులను ఊడ్చే ఓపికలేదనో... భవనం సుందర దృశ్యానికి అడ్డుగా ఉందనో... ఇలా అనేక కారణాలతో చెట్లను నరికేస్తున్నారు. ప్రాణవాయువును పంచే పచ్చని చెట్లను పరిరక్షించుకోవాలన్నది మానవ ధర్మంగా భావించాలి.

కనుమరుగవుతున్న చెరువులు

చెరువులు గ్రామీణ సామాజిక, ఆర్థిక జీవన విధానానికి మూల సహజ వనరు. పూర్వం మనిషి దాహాన్ని తీర్చేవి ఈ చెరువులే. వ్యవసాయ క్షేత్రాల్లోని చెరువులు పశువుల దాహార్తిని తీర్చేవి. ప్రకృతిసిద్ధంగా ఉన్న చెరువులు కాస్తా ఆధునిక కాలంలో వాణిజ్య చెరువులుగా మారాయి. కొన్ని గ్రామాల్లో నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అంగర, కపిలేశ్వరపురం, టేకి తదితర గ్రామాల్లోని చెరువులు చేపల సాగుతో అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. నివాస ప్రాంతాల్లోని చెరువులు ఆక్రమణలకు గురై భవనాలు వెలిశాయి.

నేస్తాలను ఇలా పరిరక్షించుకుందాం

కేంద్ర ప్రభుత్వం అమృత సరోవర్ పేరుతో చెరువుల చుట్టూ మొక్కలు పెంచేందుకు కార్యాచరణ చేపట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర పరిధిలోని వ్యవస్థల ద్వారా మొక్కలను నాటి పరిరక్షించింది. అమృత్ సరోవర్ ట్యాంక్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 2022లో జిల్లాకు 75 చెరువుల చొప్పున మంజూరు చేసింది. గట్లపై మొక్కలు నాటి, సిమెంట్ బెంచ్‌లను అమర్చి పార్కులుగా అభివృద్ధి చేసింది. అందులో భాగంగా కపిలేశ్వరపురం మండలం నేలటూరు, రాయవరం మండలం వెంటూరు, రామచంద్రపురం మండలం మాలపాటు చెరువులను అభివృద్ధి చేశారు. 2023లో మండలానికి నాలుగు చెరువుల చొప్పున మంజూరు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం



చెట్లు, కాలువలతో ప్రకృతి సిద్ధంగా ఉన్న కపిలేశ్వరపురం లాకుల ప్రాంతం




అంగర చేనేత కాలనీలో చెట్ల చెంత ఉన్న సెంటర్

పేరుతో రహదారులు వెంబడి, ప్రభుత్వ ఖాళీ ప్రదేశాల్లో ఫలప్రదమైన మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టింది. 2022లో కపిలేశ్వరపురం మండలం నిడసనమెట్టలో 200, రాయవరం మండలం కురకాళ్లపల్లి, వెంటూరు, నదురుబాద, వి.సావరం గ్రామాల్లో 1,140, కె.గంగవరం మండలం దంగేరు, యండగండిలలో 260 మొక్కలు, కాజులూరు మండలంలో 1,660 మొక్కలను నాటారు.

కూటమి ప్రభుత్వ హామీలపై నిలదీత

- వలంటీర్లను కొనసాగిస్తామన్న హామీ మాటేంటి?
- శాసనమండలిలో ప్రశ్నించిన తోట త్రిమూర్తులు

మండపేట: ఓడ దాటే వరకూ ఓడ మల్లయ్య ఓడ దాటాక బోడి మల్లయ్య అన్నచందాన కూటమి నాయకుల తీరు తెన్నులున్నాయని ప్రజలు తూర్పార పడుతుంటే, మరోపక్క శాసనమండలి సమావేశాల్లోనూ కూటమి ప్రభుత్వాన్ని ప్రతిపక్ష నాయకులు తమదైన శైలిలో విరుచుకు పడుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చేసిన వాగ్దానాలు ఏమయ్యాయంటూ వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్సీలు ప్రజల గొంతుకై వినిపిస్తున్నారు. మండలి సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మండలిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న పింఛన్ల కోసం మాట్లాడితే నేడు వలంటీర్ల కోసం శాసనమండలిలో గట్టిగా నిలదీశారు. వలంటీర్లను ఉంచేది లేనిదీ



శాసనమండలిలో ప్రభుత్వ హామీలపై నిలదీస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పట్టుబట్టారు. ఎన్నికల్లో వలంటీర్ల పోస్టులు ఎక్కడికి పోవు తాము అధికారంలోకి వచ్చాక పదివేలు పెంచి ఇస్తామని చెప్పి, అసలు వలంటీర్ వ్యవస్థనే నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. అధికారం కోసం కూటమి నాయకులు వలంటీర్లను నమ్మించి గొంతు కోశారని విమర్శించారు. గతేడాది ఎన్టీఆర్ జిల్లాలో వరదలు వచ్చినప్పుడు డిజాస్టర్ మేనేజ్మెంట్ అని చెప్పి సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు విధుల్లో పాల్గొనాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెమో జారీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ మెమో నంబర్ 2544493 తేదీ:7.9.2024ను ఆయన ఉదహరించారు. వలంటీర్లతో అవసరం తీరిన తర్వాత నవంబర్ 2024 వరకు వలంటీర్లకు సీఎఫ్ఎంఎస్ ఐడీలున్నా 2,56,000 మందిని అన్యాయంగా విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. విపత్తు సమయాల్లో వాడుకున్నప్పుడు వారి ఉద్యోగాలకూ గ్యారెంటీ ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం తప్పు చేసిందని కూటమి నాయకులు తప్పు పట్టినా ఇబ్బంది లేదని, అయితే వారికి మాత్రం న్యాయం చేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లకు రూ.0 వేలు జీతాలు పెంచి ఇస్తామని పెరిగిన తర్వాత చించినాడ పూతరేకులు, జున్ను తేవాలని ఓ మంత్రి గారు అన్న మాటలను గుర్తుచేశారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

మండపేట: ఎన్నికల నిర్వహణపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష జరిగింది. తహసీల్దార్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, రిటర్నింగ్ అధికారి బాలసరస్వతి హాజరై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. వారి నుంచి పలు సూచనలు, సలహాలు స్వీకరించారు. నివేదికను పై అధికారులకు పంపుతామన్నారు. బాలసరస్వతి మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయినప్పటికీ ఓటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. 6, 7, 8 ఎన్నికల దరఖాస్తు ఫారం కోసం, పోలింగ్ స్టేషన్ల, లొకేషన్ల వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో రాయవరం, మండపేట తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ మెహెర్‌బాబా, వైఎస్సార్ సీపీ, టీడీపీ,



సమావేశంలో మాట్లాడుతున్న మండపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి

జనసేన నాయకులు యరమాటి వెంకన్నబాబు, మేడపాటి రవీంద్రరెడ్డి, నామాల చంద్రరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

మండపేట: పురపాలక సంఘానికి ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మార్చి నెలాఖరుకు నూరు శాతం వసూళ్లకు పురపాలక సంఘ అధికారులు కృషి చేస్తున్నామన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పన్నులు కట్టేందుకు ప్రజలు ఇబ్బంది పడకూడదని ప్రతి ఇంటికీ కార్యాలయ సిబ్బంది వచ్చి కట్టించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. 30 వార్డులకు తిరిగి పన్నులు కట్టించుకోవడానికి ప్రత్యేకంగా బృందాలను నియమించామని ఆయన అన్నారు. కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలకు సౌకర్యవంతంగా వుండటానికి బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో జేవీఎస్ శాస్త్రి,



పన్ను వసూలు చేస్తున్న ఉద్యోగులు

డీఈ కె.శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, ఆంజనేయులు, టీపీవో కె.రమ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైద్య మిత్రలు

మండపేట: గత పదిహేడేళ్లుగా వైద్యమిత్రలుగా సేవలందిస్తున్న తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చి అండగా నిలవాలని ఎన్టీఆర్ వైద్య మిత్ర యూనియన్ నాయకులు మద్దింశెట్టి శంకర్‌నారాయణ, ఆకుల రాజు, అద్దంకి దుర్గాప్రసాద్, తెలగాణ శ్రీనివాస్, వై.నాగతులసీకృష్ణలు కోరారు. న్యాయమైన డిమాండ్ల సాధనకై సోమవారం జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న వైద్యమిత్రలు తమ విధులు బహిష్కరించారు. ఈ మేరకు అమలాపురం వెళ్లి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని మండపేట వైద్యమిత్రలు ఆకుల రాజు, గనిశెట్టి వీరబాబులు తెలిపారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రమాదంలో మృతి చెందిన మిత్రలకు రూ.25 లక్షల పరిహారం అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్టు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యమిత్రలు శేఖర్, సతీష్‌కుమార్, భద్రరావు, వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు యర్రగంటి శ్రీదత్తు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం బీరు ఫ్యాక్టరీ సమీపంలో ప్రమాదవశాత్తూ చెట్టును ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ద్రాక్షారామ పోలీసులు, మృతుడి బంధువులు తెలపిన వివరాలిలా ఉన్నాయి. రాయవరం మండలం వెంటూరుకు చెందిన యర్రగంటి శ్రీదత్తు (28) తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నాడు. సోమవారం పనికి వెళ్లలేదు. రామచంద్రపురం పట్టణంలోని చప్పిడివారి సావరంలో అత్తవారి ఇంటికి వెళ్లి తిరిగి వెంటూరుకు వెళుతుండగా బీరు ఫ్యాక్టరీ సమీపంలోని వే బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తూ చెట్టును ఢీకొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడికి తీసుకెళ్లిన కొద్దిసేపటికే అతడు మృతి చెందాడు. దీనితో ద్రాక్షారామ పోలీసులు ఆసుపత్రి సమాచారం, మృతుడికి వరుసకు సోదరుడయ్యే శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మండపేట: మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. సోమవారం ఆయన ప్రకటనలో మాట్లాడుతూ 132 కేవీ లైన్ పనుల నిమిత్తం తాపేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు. వెలగతోడు 11 కేవీ ఫీడర్ సరఫరా నిలుపుదల చేస్తున్నందున పేకేటిపాకల, పాలతోడు, వెలగతోడు, మెర్నిపాడు గ్రామాలకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ద్వారపూడి ఏఈ విజ్ఞప్తి చేశారు. బోర్లకిచ్చే సరఫరా అర్ధరాత్రి 12 గంటలకు విడుదల చేస్తామని రైతులకు గమనించాలని కోరారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఠాగూర్

కాజులూరు: మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్నందున గ్రామాల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందన్నారు. దాతలు ముందుకు రావాలన్నారు. రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా కార్యాలయానికి వచ్చే సందర్శకులతో పాటు స్థానికులకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



అంగర పరీక్ష కేంద్రం వద్ద బోర్డుపై రూం నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



ద్రాక్షారామలో ప్రత్యేక అవసరాలు కలిగిన అభ్యర్థికి పరీక్ష రాస్తున్న విద్యార్థిని



పసలపూడి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో అఖిల

- కపిలేశ్వరపురం మండలంలో ఒక్కరు గైర్హాజరు
- 469 మందికి 468 మంది హాజరు

కపిలేశ్వరపురం: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యారు. 8 జిల్లా పరిషత్, మూడు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 469 మందికి 468 మంది పరీక్షలు రాశారు. నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని పరీక్షకు గైర్హాజరయింది. 230 మంది బాలురు నూరుశాతం హాజరుకాగా, 239 మంది బాలికలకు 238 మంది హాజరై ఒక బాలిక గైర్హాజరైంది.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో కుయ్యేరు, కాజులూరు, గొల్లపాలెం కేంద్రాల్లో మొత్తం 594 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా తొలి రోజు నూరుశాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు ఎంఈవో డేవిడ్ తెలిపారు. ఉదయం 9 గంటల 30 నిమిషాలకు పరీక్ష ప్రారంభం కాగా దాదాపు అన్ని కేంద్రాల్లోనూ అర్ధగంట ముందే విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారయ్యారన్నారు. కాజులూరు పరీక్ష కేంద్రాన్ని మండల తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్ సందర్శించగా గొల్లపాలెం పరీక్ష కేంద్రాన్ని కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు.

రాయవరంలో..

రాయవరం: చదువుల యజ్ఞంలో మైలురాయిగా నిలిచే పదో తరగతి పరీక్షలు మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో మొదలయ్యాయి. రాయవరంలోని రామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల, చెల్లూరు, పసలపూడి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రాల్లో 674 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 667 మంది విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షకు హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పసలపూడి పరీక్ష కేంద్రాన్ని రామచంద్రపురం ఆర్డీవో అఖిల ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్ కూడా తనిఖీలు చేపట్టింది.

మండపేటలో..

మండపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో మొదలయ్యాయి. మండలంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లోను, టౌన్‌లోను ప్రారంభమైన పరీక్షలకు సంబంధించి ఐదుగురు విద్యార్థులు మినహా, మొత్తం 1778 మందికి గాను 1773 మంది విద్యార్థులు హాజరయ్యారయ్యారని ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి తెలిపారు. టౌన్, రూరల్‌లో ఏర్పాటు చేసిన మొత్తం 9 పరీక్ష కేంద్రాల్లోను విద్యార్థులు హాజరై మొదటి రోజు తెలుగు పరీక్ష రాశారు. తొలి రోజు కావడంతో పరీక్ష కేంద్రాల బయట పరీక్ష గదులు, రోల్ నంబర్ల కోసం విద్యార్థులు కాస్త కంగారు పడాల్సి వచ్చింది. దానికి తోడు ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఉక్కబోతకు గురయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలు పరీక్ష రాసి వచ్చేంత వరకూ పరీక్ష కేంద్రాల బయట చెట్ల కింద సేదతీరారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్, వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్, ఆదివారపుపేట గురుకుల పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ద్రాక్షారామలో 317 మంది, వెంకటాయపాలెంలో 87 మంది నూరు శాతం పరీక్షలకు హాజరు కాగా, ఆదివారపుపేటలో మాత్రం 230 మందికి ఒకరు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ వీర్రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా తల్లిదండ్రులు తమ పిల్లలు పరీక్ష హాలులో పరీక్షలు రాస్తుంటే బయట వారి కోసం వేచి ఉన్నారు.

క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారి ఊరేగింపు



నూకాంబిక అమ్మవారి ఊరేగింపు

కపిలేశ్వరపురం: స్థానికంగా నూకాంబిక అమ్మవారి ఊరేగింపు సోమవారం నిర్వహించారు. అమ్మవారి జాతర ఉత్సవాలు నేపథ్యంలో ఆలయంలో అమ్మవారి బుట్ట గరగను గ్రామాల వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించారు. జాతర ఏర్పాట్లను నిర్వహణ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

ప్లీజ్..ఒక్క నిమిషం ఆలోచించండి



వాల్‌పోస్టర్‌తో ఉపాధ్యాయులు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే.. ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ప్లీజ్.. ఒక్క నిమిషం ఆలోచించండి.. అంటూ ఉపాధ్యాయులు ఇంటిబాట పట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలంటూ మండలంలోని పసలపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటి బాట పట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను హెచ్ఎం కె.వెంకటరమణ ఆధ్వర్యంలో వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడం కలిగే ప్రయోజనాలను వాల్‌పోస్టర్లుగా, కరపత్రికలుగా రూపొందించి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. అలాగే మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడేందుకు మార్చి నెలలోనే విద్యార్థుల కోసం ఇంటి బాట పట్టారు.

రైలు ఢీకొని మృతి



వల్లూరి సురేష్ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడుకు చెందిన టీడీపీ నాయకుడు వల్లూరి సురేష్(50) ఆదివారం రాత్రి బిక్కవోలు వద్ద రైలు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందారు. ఆయన ప్రస్తుతం వెలంపాలెం నీటి సంఘం అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

నేషనల్ మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

ఆలమూరు: గ్రామానికి చెందిన సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్‌లో చక్కని ప్రతిభ కనబర్చారు. విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో సరళాదేవి కల్యాణ మండపంలో ఇటీవల జాతీయస్థాయిలో కరాటే తైక్వాండో, కుంగ్‌ఫూ పోటీలు జరిగాయి. అందులో భాగంగా టైక్వాండో పోటీల్లో బ్రౌన్ బెల్ట్ కటాస్ ఏ విభాగంలో గెద్దాడ జాయ్ కిరణ్ (గోల్డ్), బ్లూ బెల్ట్ విభాగంలో జి.షణ్ముఖ (గోల్డ్), ఎల్లో బెల్ట్ బి విభాగంలో బండి దైవిక్ ఆశిష్ (గోల్డ్), బ్రౌన్ బెల్ట్ బి విభాగంలో కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బుంగ అశ్విన్ (గోల్డ్), ఎల్లో బెల్ట్ బి.విభాగంలో జి.సత్య మోహన్ మణికంఠ (సిల్వర్) మెడల్స్ సాధించినట్లు కోచ్ టి.వెంకటలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు.

నేలతల్లి బాగు కోసం ప్రకృతి వ్యవసాయం

అయినవిల్లి: ప్రకృతి వ్యవసాయంతో నేల తల్లి ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు ప్రజలకు అందించవచ్చని నేచురల్ ఫార్మింగ్ అడిషనల్ డీపీఎం సత్యనారాయణ అన్నారు. సోమవారం నేదునూరులో ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. సత్యనారాయణ మాట్లాడుతూ నేల భూసారం పెంచేందుకు ప్రస్తుత పరిస్థితిల్లో ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమన్నారు. 30 రకాల విత్తనాలతో సాగు నేల తల్లి బాగు కోసం ప్రభుత్వ సాయంతో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇక్కడ వరి పంట ప్రధాన పంటగా సాగవుతుందన్నారు. రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయం ప్రధానమన్నారు. వివిధ రకాల పంట వైవిధ్యం వల్ల భూమిలో జీవవైవిధ్యం పెరిగి ఆ పంటకు కావలసిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా 365 రోజులు భూమిని కప్పి ఉంచడం వలన భూమిలో తేమ శాతం నిల్వ ఉంటుందన్నారు. సూర్యరశ్మి నేరుగా భూమిని తాకకుండా ఉంటుందన్నారు. తద్వారా భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు, మిత్రపురుగులు ఉధృతంగా పెరుగుతుందన్నారు.